దర్గాగా
మొరం తవ్వకాలు 2






3
డీసీఎంను
ఢీకొన్న బస్సు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in



## ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీలో వేసవి శిక్షణ శిబిరం

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతున్నట్లు అకాడమీ కోచ్ సాయిలు తెలిపారు. శిబిరంలో యువతకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తూ శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించేలా మార్గనిర్దేశనం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చిల్క దినేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు రాకేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.





## రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** రైతులు లాభసాటి పంటలు పండించేలా అధికారులు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని పోచారం అన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాది మొత్తం తినేది 40 లక్షల టన్నులు అయితే రాష్ట్రంలో అంతకంటే ఎక్కువ వరిధాన్యం పండుతుందన్నారు. వాటిని నిల్వ చేయడానికి గోదాములు సరిపోవడం లేదన్నారు. అందుకే అధికారులు పంట మార్పిడి కోసం రైతులను ప్రోత్సహించాలని, రైతు వేదికలలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అయితే అనర్హులకు ఇళ్ల మంజూరు చేస్తున్నారని అక్కడక్కడా ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు , జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇన్‌ఛార్జి అడిషనల్ కలెక్టర్ గిరి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తి కావడం, పంటలు చేతికి రావడంతో కూలీలు పెద్ద సంఖ్యలో ఉపాధి హమీ పనులకు హాజరవుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఉదయమే పనులకు వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాల్లో జాతరను తలపించేలా సందడి నెలకొంటుంది. - అక్షరటుడే, భీమ్‌గల్

# జోరుగా ఉపాధి పనులు

- కూలీల హాజరులో టాప్‌లో ఉమ్మడి జిల్లా
- వ్యవసాయ పనులు పూర్తి కావడంతో..
- ఉపాధి హామీ బాట పట్టిన గ్రామీణులు

యాసంగి సాగు పనులు పూర్తయ్యాయి. తొలకరి పలకరింపు తర్వాత వానాకాలం పనులను రైతులు మొదలు పెట్టనున్నారు. అప్పటి వరకు గ్రామాల్లో పనులు ఏమీ లేకపోవడంతో ప్రజలు ఉపాధి హామీ పనులకు హాజరు అవుతున్నారు. ఇటీవల నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్షా నివేదికల ప్రకారం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కూలీల హాజరు గణనీయంగా పెరిగింది. మే 22 నాటికి అధికారిక గణాంకాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలోని 31 మండలాల్లో మొత్తం 1,295 పనుల వద్ద 69,337 పని దినాలు కల్పించారు. డిచ్‌పల్లి మండలంలో 4,232 కూలీలు, భీమ్‌గల్ 4,134, ఇందల్వాయి 3,807 కూలీలు హాజరై అగ్రస్థానంలో ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని 25 మండలాల్లో మొత్తం 1,212 పనులకు గానూ 54,046 మంది కూలీలకు పని కల్పించారు. ఇందులో లింగంపేట మండలం అత్యధికంగా 5,659 మంది కూలీలతో ప్రథమ స్థానంలో నిలవగా, గాంధారి 4,285 కూలీలు హాజరై తర్వాతి స్థానంలో నిలిచింది.

### ఈ పనులకు ప్రాధాన్యత

ఉపాధి హామీ పథకంలో చెరువుల పూడికతీత పనులు చేపడుతున్నారు. పంట కాల్వల్లో పూడికతీత, అభివృద్ధి పనులు, నీటి నిల్వ కుంటల నిర్మాణం, వ్యవసాయ బావుల పునరుద్ధరణ వంటి పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. వీటితో పాటు వ్యవసాయ క్షేత్రాల చదును, రోడ్ల నిర్మాణం, భూగర్భ జలాల పెంపునకు కరకట్టల నిర్మాణం, భారీ, వ్యక్తిగత ఇంకుడు గుంతల ఏర్పాటు వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తమ సొంత గ్రామాల పరిధిలోని సాగు భూములకు నీరందించే కాల్వలు బాగుపడుతుండడంతో కూలీలు కూడా ఎంతో ఉత్సాహంగా హాజరవుతున్నారు.

### పని కల్పిస్తున్నాం

గ్రామాల్లో పనులు కావాలని అడిగిన ప్రతి ఒక్క కూలీకి వెంటనే ఉపాధి కల్పిస్తున్నాం. అర్హులైన వారికి వెనువెంటనే కొత్త జాబ్ కార్డులను జారీ చేస్తున్నాం. పనుల్లో పారదర్శకత కోసం మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ముఖ గుర్తింపు ఆధారిత హాజరును పక్కాగా అమలు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో అధికారు లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పనులను ఎప్పటికప్పుడు సందర్శిస్తూ కూలీలకు తగిన సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు అవసరమైన నీడ, తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నాం. – సాయన్న, డీఆర్‌డీవో

## ఎల్లారెడ్డి ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐలో 2026-27 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రూపా నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పాసైన అభ్యర్థులు వచ్చేనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వెహికల్, మెకానిక్, ఇంజినీర్ డిజైనింగ్ టెక్నీషియన్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.



## జక్రాన్‌పల్లిలో సోలార్ ప్లాంట్ పరిశీలన

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని జక్రాన్‌పల్లిలోని 0.8 మెగావాట్ల సోలార్ ప్లాంట్ పనితీరును ప్రొడక్ట్స్ డైరెక్టర్ మోహన్ రావు, ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజినీర్ సురేందర్ శుక్రవారం పరిశీలించారు. ప్లాంట్ ప్రతిరోజూ ఎన్ని యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సగటున ప్రతివారం సోలార్ ప్యానల్స్ అన్నింటినీ తప్పనిసరిగా శుభ్రం చేయాలని, అలాగే ప్లాంట్ ప్రహరీ నిర్మాణాన్ని వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ పీవీ రాజేశ్వరరావు, డీఈలు వెంకటరమణ, హరిచంద్ర నాయక్, కె. స్వామి, ఏడీఈలు తోట రాజశేఖర్, సాయి, ఏఈలు ప్రవీణ్, భాస్కర్, కార్తీక్, సోలార్ ప్లాంట్ కాంట్రాక్టర్ ప్రతినిధి సతీష్‌రావు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయన దిశానిర్దేశం చేశారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ అంశాలపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎస్ఐఆర్‌లో భాగంగా గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ ప్రజల ఓట్లు పోకుండా చూసుకోవాలని ఆయన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ అంశంపై త్వరలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుద్దామని పేర్కొన్నారు. పార్టీ తరపున నియమించిన బూత్ ఏజెంట్ల సహకారంతో ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, సీనియర్ నాయకుడు కేఆర్ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు ముజీబొద్దీన్, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి తదితరులు పాల్గొన్నారు.





## అధికారులు 'అర్బన్'పై దృష్టి పెట్టాలి : ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు**: అధికారులు అర్బన్ నియోజకవర్గంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని.. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా పనిచేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు అర్బన్ విషయంలో ప్రతి పథకంపై దృష్టి సారించాలని సూచించారు. నివేదికలు ఇస్తున్నారు కానీ 99 రోజుల్లో ఏం చేశారో చెప్పలేదన్నారు. ప్రతి శాఖ నివేదికలు ఒకలా ఉంటే క్షేత్రస్థాయిలో ప్రగతి మరోలా ఉంటుందన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో అనేక సమస్యలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా నూతన బస్టాండ్ నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కేటాయింపు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇలా అనేకం ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

### సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ప్రశంసాపత్రాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా సామాజిక మాధ్యమాల ద్వారా కృషి చేసిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను జిల్లా యంత్రాంగం ప్రశంసించింది. ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారికి ప్రశంసాపత్రాలును అందజేసింది. ప్రజాపాలన..ప్రగతి ప్రణాళికలో భాగంగా.. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రోడ్డు భద్రతా చర్యల గురించి ఇన్‌ఫ్లుయెన్సర్లు విశేషంగా కృషిచేశారన్నారు. వారి కృషిని గుర్తించి సత్కరించినట్లు ఆయన పేర్కొన్నారు.



## బాల్య వివాహాల నివారణపై అవగాహన

**అక్షరటుడే, ముప్కాల్:** ఐకేపీ ఆధ్వర్యంలో కిషోర బాలికల సమావేశాన్ని శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో పోషణ, సైబర్ భద్రత, బాల్య వివాహాల నివారణపై బాలికలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యం, విద్య, భద్రత అంశాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, సీసీలు, వీవోఏలు, కిషోర బాలికల సంఘం సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

## 64 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ.. ముఠాను పట్టుకున్న పోలీసులు




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఏకంగా 64 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ పీఎస్ పరిధిలో ఎస్సై తన సిబ్బందితో సాటాపూర్ బైపాస్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. మూడు బైక్‌లపై వెళ్తున్న వీరివద్ద గన్నీ బ్యాగ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ బయటపడ్డాయి. దీంతో వారిని పట్టుకుని విచారించగా తాము చేసిన 64 ట్రాన్స్‌ఫార్మర్ల కాయిల్స్ చోరీల గుట్టు విప్పారు. నాలుగైదు జిల్లాలలో చోరీ చేసిన కాయిల్స్‌ను సయ్యద్ అక్బర్ హుస్సేన్, షేక్ మహబూబ్ , మాలప్ప మాస్టర్, తాయప్ప దంగల్ అనే వ్యక్తుకు చెందిన స్క్రాప్ దుకాణాల్లో అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ముఠాలో సభ్యులైన వనం సాయిలు, జగన్నాథం, వనం పోశెట్టి, ధనశ్రీ కిరణ్, దాసరి పోచయ్య, ఇద్దరు వ్యాపారస్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి 80 కేజీల రాగి కాయిల్స్, మూడు బైక్‌లు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, ఎస్సైలు చంద్రమెహన్, మచ్చేందర్‌రెడ్డి, విఠల్, కానిస్టేబుళ్లను అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్లపై పురోగతి లేకపోతే ఎలా..?: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** రెండేళ్లలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి లేకపోతే ఎలా అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అధికారులను ప్రశ్నించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని సత్య కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. అధికారుల మధ్య సమన్వయ లోపం, సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అంతే తప్ప సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. మున్సిపల్ కార్మికులకు సీఎం జీతాలు పెంచుతూ నిర్ణయించడం అభినందనీయమని, అదే సమయంలో పంచాయతీ కార్మికులకు కూడా జీతాలు పెంచాలని సీఎంను కోరతానన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీలో పన్ను వసూళ్లు తగ్గాయని, వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. కామారెడ్డికి త్వరలో తాగునీటి సమస్య పరిష్కారం కాబోతోందని, ప్రస్తుతం 10 ఎంఎల్డీ వాటర్ వస్తున్నాయని, త్వరలో 14 ఎంఎల్డీ వాటర్ రాబోతున్నాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నారు. గోదాముల ఖాళీ లేవని, ఖాళీ ఉంటే లేబర్ సమస్య ఉంటుందని, లేబర్ ఉంటే హమాలీలు ఉండడం లేదని, అన్నీ ఉంటే లారీలు దొరకడం లేదన్నారు. గత సీజన్‌లో జిల్లాలో 3.80 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తే ఈసారి 4 లక్షలకు చేరిందన్నారు. వీలున్న చోట పంట మార్పిడి చేయాలని సూచించారు. మాచారెడ్డి, రామయంపేట్‌లో తన సొంత భూమిలో వచ్చే సీజన్ నుంచి ఆయిల్ పామ్ సాగు చేస్తానని షబ్బీర్ అలీ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు, గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, మున్సిపల్ ఛైర్మన్లు పాల్గొన్నారు.



### గరీబోళ్ల కోసం మాట్లాడడం కాంట్రవర్సీ అయితే రోజూ మాట్లడతా.. : లక్ష్మీకాంతారావు

గరీబోళ్లు, ప్రజల కోసం మాట్లాడితే కాంట్రవర్సీ అయితే తాను ప్రతిరోజూ మాట్లాడతానని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు అన్నారు. ముఖ్యంగా జుక్కల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడంలో అధికారులు విఫలం అవుతున్నారని తెలిపారు. త్వరలో పూర్తవుతాయని ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇవ్వవద్దని సూచించారు. సంబంధిత శాఖలో కో-ఆర్డినేషన్ లేదని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పక్కనే ఇసుక ఉంటే 50 కిలోమీటర్ల దూరం నుంచి తెచ్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారని తెలిపారు. మానవతా దృక్పథంతో చూడాలని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.



## డేటా సేకరణలో నిర్లక్ష్యం వద్దు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయి డేటా సేకరణలో నిర్లక్ష్యం వహించరాదని ఆర్డీవో ప్రభాకర్ సూచించారు. ఈ మేరకు ఎల్లారెడ్డి పరిధిలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో కలిసి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. హౌస్‌హోల్డ్ లిస్టింగ్ బుక్‌లెట్స్‌లలో గుర్తించిన తప్పులను అధికారులు వివరించారు. క్షేత్రస్థాయిలో డేటా సేకరణలో పునరావృతం అవుతున్న లోపాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. డేటా ఎంట్రీ సమయంలో ప్రతి అంశాన్ని సరిచూసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని ఆదేశించారు. ప్రజల వ్యక్తిగత వివరాల గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా ఖచ్చితమైన డేటా అప్‌లోడ్ చేసేలా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశానికి ఎల్లారెడ్డి తహశీల్దార్ ప్రేం, ఎంపీడీవో తాహెరా బేగం హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాల అమలుకు ఖచ్చితమైన డేటానే ఆధారం కాబట్టి బాధ్యతతో పనిచేయాలని కోరారు.

## సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన




**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై అనిల్‌రెడ్డి పేర్కొన్నారు. 'మన ఊరు మన భద్రత-మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కోనసముందర్‌లో ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి ఉపయోగాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. సీసీటీవీ కెమెరాలు గ్రామంలో నిరంతర నిఘా ఉంచుతూ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తాయని చెప్పారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు పోలీసుల విచారణకు, నిందితులను త్వరగా పట్టుకోవడానికి ఈ విజువల్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామాల రక్షణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. సదస్సులో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొరం అక్రమ రవాణాలో తగ్గేదేలే..



**పట్టపగలు, నడిరోడ్డుపై దర్జాగా మొరం టిప్పర్లు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదు. హెవీలోడ్‌తో రహదారులు ఛిద్రమవుతున్నా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న తవ్వకాలపై అధికారుల మౌనం దేనికి సంకేతమో తెలియడం లేదని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పచ్చని భూముల్లో సాగుతున్న దందాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం ఎక్కడికి పోయిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

### అధికారుల మౌనం దేనికి సంకేతం?

మొరం తవ్వకాలు చేపట్టాలంటే స్థానిక రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి. నిబంధనల ప్రకారం మాత్రమే కొలతల ప్రకారం తవ్వకాలు చేపట్టాలి. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం 20-30 అడుగుల లోతుగా తవ్వకాలు చేపడుతున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు ఈ తతంగమంతా తెలిసే జరుగుతోందని తెలుస్తోంది. నడిరోడ్డుపై వందల టిప్పర్లు తిరుగుతున్నా ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అధికారులను మేనేజ్ చేయకుండా ఇంత ధైర్యంగా తవ్వకాలు సాగవని గ్రామస్తులు బహిరంగంగానే చెబుతున్నారు.



**■ దర్జాగా తవ్వకాలు.. ■ గుంతలతో ప్రమాదకరంగా భూములు ■ అభివృద్ధి పేరుతో యథేచ్ఛగా వ్యాపారం ■ పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు**

కామారెడ్డి పట్టణానికి చేరువలో ఉన్న గ్రామాల శివారులో మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. శివారు గ్రామాల ప్రజలకు నయానో బయానో ఎంతో కొంత ముట్టజెప్పి కోట్లలో వ్యాపారం చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా కూడా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీనిని బట్టి సదరు మొరం వ్యాపారులు ఏ మేరకు అధికారులను మేనేజ్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

### అభివృద్ధి పేరుతో తవ్వకాలు

అభివృద్ధి పేరు చెబితే చాలు, అక్రమాలకు లైసెన్స్ దొరికినట్టే. కామారెడ్డి పట్టణ శివారు గ్రామాల్లో మొరం మాఫియా దర్జాగా రెచ్చిపోతోంది. గ్రామాల్లోని కొందరు రైతుల వద్ద తక్కువ ధరకు భూములు లీజుకు తీసుకుని మొరం తవ్వకాలు చేస్తున్నారు. గ్రామాలకు రోడ్లు వేస్తామని నమ్మబలికి వ్యాపారానికి తెర తీస్తున్నారు. ప్రజలకు అవసరమైన రోడ్డు వేసి మిగతా మొరంతో కోట్లాది రూపాయల వ్యాపారం సాగిస్తున్నారు. తెలివిగా గ్రామస్థులతో తీర్మానం చేయించుకుని అధికారులను మాయ చేస్తున్నారు.

### రోడ్లపైనే టిప్పర్లు తిరుగుతున్నా..

కామారెడ్డి పట్టణంలో శివారు ప్రాంతాల నుంచి రోజూ పదుల సంఖ్యలో టిప్పర్లు తిరుగుతున్నాయి. మొరం లోడ్‌తో టిప్పర్లు పరుగులు తీస్తున్నా, హెవీ లోడ్‌తో రహదారులు ఛిద్రమవుతున్నా అధికారులకు కనిపించడం లేదు. చట్టం నిద్రపోతోందా, లేక మామూళ్ల మత్తులో జోగుతోందా అనే అనుమానాలు ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్నాయి.

### పట్టించుకోని అధికారులు

కామారెడ్డి మండలం శాబ్దిపూర్, పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామాల శివారు గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండానే మొరం తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. భూ యజమానులను నయానో, భయానో ఒప్పించి భూములను గుంతలుగా మార్చేస్తున్నారు. ఒకసారి తవ్వితే ఆ భూమి వ్యవసాయానికి పనికిరాకుండా పోతోందని తెలిసినా రైతులను మభ్యపెట్టి డబ్బుతో కొంటున్నారు. రాయల్టీ చెల్లించకుండా రూ.కోట్లల్లో మొరం తరలిపోతోంది. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లుతోంది.

### ప్రమాదకరంగా మారుతున్న ప్రాంతాలు

శివారు గ్రామాల్లో 20 - 30 అడుగుల లోతు గుంతలు తవ్వేయడంతో వర్షాకాలంలో నీరు నిలిచి పశువులు, చిన్నపిల్లలకు అవి ప్రాణహానిగా మారుతున్నాయి. భూగర్భ జలాలు కూడా దెబ్బతింటున్నాయి. ఈ విషయాలపై పలువురు ప్రశ్నిస్తే గ్రామస్థులతో సమాధానం చెప్పిస్తున్నారు. గ్రామానికి పైసలు వస్తుంటే అడ్డుకుంటారా అంటూ ఎదురు దాడికి పాల్పడుతున్నారు.

### రోడ్లు దెబ్బతింటున్నాయి..

గ్రామాల శివారులో మొరం తవ్వకాలతో ఇబ్బందులు వస్తున్నాయి. ఆరు నెలల క్రితం వేసిన రామేశ్వర్ పల్లి రోడ్డు హెవీ లోడుతో టిప్పర్లు తిరగడంతో కంకర తేలింది. ఈ విషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి మొరం తవ్వకాలను నిలిపివేయాలి.



**- ప్రభాకర్ రెడ్డి, గ్రామస్థుడు**

## త్రెసా, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తలసేమియా రోగుల కోసం హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ట్రెసా, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానమన్నారు. ఎండాకాలంలో తీవ్రమైన రక్త కొరత ఏర్పడుతుందని, రెడ్‌క్రాస్‌లో తలసేమియా రోగులకు కొరత రావొద్దనే ఉద్దేశంతో ట్రెసా, హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చి రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి తోట రాజశేఖర్, ట్రెసా, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాళేశ్వర్‌లో జీలుగ విత్తనాల పంపిణీ



**అక్షరటుడే, బోధన్:** నవీపేట్ మండలంలోని బినోలా సొసైటీ పరిధిలో శుక్రవారం జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఆర్మూర్ లావణ్య, ఉపసర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ హన్మాండ్లు మాట్లాడుతూ.. బినోల, నాళేశ్వర్ గ్రామాల రైతులకు సబ్సిడీపై రూ.2,452.50కు విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్లు విజయ్, అంజాగౌడ్, లిఫ్ట్ డైరెక్టర్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ పీతాంబర్, రైతులు ద్యాగకిరణ్, సుదర్శన్, తోట పోతన్న, రమేష్, దేవేందర్, పోశెట్టి, శ్రీనివాస్, సురేష్, మహేష్, ప్రశాంత్, సొసైటీ సీఈవో రమేష్ పాల్గొన్నారు.



## పత్తి చెట్టు కాదది.. కొంగల గుంపు..

**ఒక్కసారిగా ఈ ఫొటోను చూస్తే పత్తి చెట్టులా కనిపిస్తుంది కదూ.. కానీ పరిశీలనగా చూస్తేనే తెలుస్తుంది అది పత్తిచెట్టు కాదు అని.. సాయంవేళ గాంధారి మండల కేంద్రంలో ఓ చెట్టుపై కొంగల గుంపు కూర్చున్నప్పుడు తీసిన చిత్రమిది..**

**– అక్షరటుడే, గాంధారి**

## వైభవంగా 'శ్రీమద్భాగవత మహాపురాణ' సప్తాహం







**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్‌లోని బాలాజీ మందిరంలో జుక్కల్ మఠం సద్గురు గోపాల్ మహారాజ్ రామదాసి ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత మహాపురాణ సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. మే 16న మండల కేంద్రానికి చేరుకున్న గోపాల్ మహారాజ్ దంపతులకు మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు.

### వారం రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు..

వారం రోజుల పాటు సాగే ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా నిత్యం ఉదయం, సాయంత్రం సర్వదేవతల అభిషేకాలు, రామదాసు భిక్షాటన, భాగవత ప్రవచనాలు, సంకీర్తనలు, నిరంతర అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గోపాల్ మహారాజ్ మాట్లాడుతూ.. గోపాల్ మహారాజ్ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రతిఒక్కరూ తల్లిదండ్రులు, గురువులు, గోమాతను గౌరవిస్తూ సనాతన ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. 'సమాజంలో ద్వేష భావనలను, కుట్రలను వీడి.. అంతా భారతీయులమనే సద్భావనతో మెలగాలన్నారు. నిష్కల్మషమైన భక్తితో దైవాన్ని స్మరిస్తే ఆ శ్రీరామచంద్రుడు ఆయురారోగ్యాలను, అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తాడని ఉద్బోధించారు. అనంతరం శ్రీకర్ మహారాజ్ తన అనుభవాలను పంచుకుంటూ.. గోపాల్ మహారాజ్ తొమ్మిదేళ్ల వయసులోనే గ్రామాన్ని వదిలి వెళ్లారని.. అనంతరం జుక్కల్‌లో గోవింద మఠాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. శనివారం జరగబోయే ముగింపు ఉత్సవాల్లో భాగంగా 'లలితా పారాయణం' నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జుక్కల్ మఠం శిష్యులతో పాటు గోపాల్, కేశవ్ నానా, శ్రీకర్ మహారాజ్ పర్యవేక్షణలో జరుగుతున్న కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ పేర్కొంది.

## జిల్లాస్థాయి క్రికెట్ ఎంపికలు



**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల మైదానంలో అండర్16, అండర్19 బాలబాలికల క్రికెట్ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 300 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సూచనల మేరకు ఎంపికలు నిర్వహించామన్నారు. అండర్16 కేటగిరీలో 30 మందిని, అలాగే అండర్19 కేటగిరీలో 30 మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన 60 మంది క్రీడాకారులకు నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు పూర్తిగా ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ సురేష్ బాబు, ప్రతినిధులు నయీమ్, లలిత్, విక్రమ్, వినోద్ పాల్గొన్నారు.

## ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న బస్సు.. తప్పిన పెనుప్రమాదం




**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటన భిక్కనూరు మండలం బస్వాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బస్వాపూర్ జాతీయ రహదారిపై మహారాష్ట్రకు చెందిన డీసీఎం వ్యాన్ ఆగి ఉంది. తెల్లవారుజామున ఉదయం 5 గంటల ప్రాంతంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను వెనకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు ఎడమవైపు అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 26 మంది ప్రయాణికులు ఉన్నారు. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ప్రమాదంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి ఆందోళనకు గురయ్యారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.